కేసీఆర్ పోరాటంతోనే సాకారం

- దీక్షా దివస్‌లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు, కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

ఏం వెలగబెట్టారని..

ఏడాది కాంగ్రెస్ పాలనలో ఏం వెలగబెట్టారని విజయోత్సవాలు జరుపుకొంటారు. ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు విజయోత్సవాలు జరుపుకొనే అర్హత లేదు. వెనకబడ్డ ప్రాంతంగా ఉన్న నారాయణఖేడ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసింది కేసీఆరే..

- భూపాల్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే, నారాయణఖేడ్

పదేండ్ల పాటు అద్భుతమైన పాలన

తెలంగాణ రాష్ట్రం సాధించి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాటు ప్రజలకు అద్భుత పాలన అందించింది. తెలంగాణ వస్తే ఏంజరుగుతుందని ఎగతాళి చేసిన వారే మెచ్చుకునేలా పాలన అందించిన మేధావి కేసీఆర్. రాక్షస కాంగ్రెస్ పాలనకు గుణపాఠం చెప్పాలంటే నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలి.

- క్రాంతి కిరణ్ మాజీ ఎమ్మెల్యే అందోల్

దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతాప్రభాకర్

కంది, నవంబర్ 29 : కేసీఆర్ పోరాట త్యాగఫలమే స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పిడికెడు మట్టితో మొక్కవోని దీక్షతో ప్రారంభించిన తెలంగాణ ఉద్యమం నాలుగు కోట్ల ప్రజల ఉద్యమంగా మారి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. శుక్రవారం కందిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించిన దీక్షా దివస్ విజయవంతమైంది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో దీక్షా దివస్‌లో పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలన దగాకోర్, అబద్ధాల పరిపాలన చేస్తుందని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయి కేసీఆర్ పాలన కోసం ఎదిరి చూస్తున్నారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

కాంగ్రెస్ మోస పూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలి. కేసీఆర్ ఒక వ్యక్తి కాదు ఆయన ఓ శక్తి. మరోసారి తప్పు జరగకుండ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి. అందరం కేసీఆర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళుదాం.

- మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్

కేసీఆర్ చరిత్రను ఎవరూ మార్చలేరు

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ చరిత్రను ఎవరూ మార్చలేరు. వెయ్యి మంది రేవంత్‌రెడ్డిలు వచ్చినా కేసీఆర్ చరిత్రను చెరపలేరు. రేవంత్‌రెడ్డి పరిపాలన చేస్తున్న సచివాలయం, చేపట్టిన అభివృద్ధి, చేపట్టాల్సిన అభివృద్ధిలో.. కేసీఆర్ ఆనవాళ్లు కనిపిస్తాయి. పాలన చేపట్టిన 9మాసాలకే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్సే.

- దేవీప్రసాద్, దీక్షా దివస్ సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం

బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం రాబోతున్నది. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు మరిచిపోరు. 1969లో విడిచిపెట్టిన తెలంగాణ ఉద్యమాన్ని మళ్లీ మొదలుపెట్టి రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ గాంధీ మన కేసీఆర్.

- మాణిక్‌రావు ఎమ్మెల్యే జహీరాబాద్

కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

సిర్గాపూర్ : కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిర్గాపూర్, నవంబర్ 29 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. నాయకుడు యాదవరావు పాటిల్, యువనేత నర్సాగౌడ్ ఆధ్వర్యంలో ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకొని నివాళులర్పించారు. నాయకులు మహేందర్‌గౌడ్, రాంజీ, వసీం, భూ మయ్య, రషీద్, గఫర్, దత్తురావు, వీరయ్య, విఠల్‌నాయక్ ఉన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం, నవంబర్ 29 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి నేతలు క్షీరాభిషేకం చేశారు. దీక్షా దివస్ సందర్భంగా ఆర్సీపురం డివిజన్‌లోని లక్ష్మీగార్డెన్స్‌లో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

రామచంద్రాపురం : కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

కేసీఆర్ స్పీచ్‌ను వింటూ పులకరించిన బీఆర్ఎస్ శ్రేణులు

కంది, నవంబర్ 29 : కంది బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం చేపట్టిన దీక్షా దివస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. కేసీఆర్ చేపట్టిన తెలంగాణ ఉద్యమంపై డాక్యుమెంటరీ ప్రదర్శన, ఉద్యమ గీతాలు, కేసీఆర్ స్పీచ్‌లను నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు. ఉద్యమం నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ పోరాట స్ఫూర్తిని తలుచుకుంటూ జై తెలంగాణ నినాదాలు చేశారు.

ప్రతివారం హాస్టళ్లను విధిగా తనిఖీ చేయాలి

ప్రత్యేక అధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 29 : జిల్లాలోని వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలలు, కేజీబీవీలను ప్రత్యేక అధికారులు ప్రతివారం విధిగా తనిఖీ చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, గురుకులాలు, కేజీబీవీల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల పరిధిలోని సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలను ప్రతి వారం తనిఖీ చేయాలన్నారు. అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, వివిధ మండలాల ప్రత్యేక అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

బీఆర్ఎస్ నాయకులను సన్మానిస్తున్న గామస్తులు

బొల్లారం, నవంబర్ 29 : ఉమ్మడి మండలాల్లోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నల్తూరు గ్రామంలో గల శివాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహాల ప్రతిష్ఠాపనకు రూ. 30 వేల విరాళాన్ని గ్రామస్తులకు అందజేశారు. యువత నాయకులు వెంకటేశం గౌడ్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్, సురేందర్ గౌడ్, మండలాధ్యక్షుడు రాజేశ్, నాయకులు బాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కృష్ణ గౌడ్, గణేశ్, భీమ్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని సీఆర్పీల ఆందోళన

ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సిర్గాపూర్, నవంబర్ 29 : పనికి తగిన కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మండల సర్వ శిక్షణ అభియాన్ ఉద్యోగులు శుక్రవారం ఆందోళనచేస్తూ సమ్మెకు దిగారు. మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని అత్యున్నత కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన వ్యక్తం చేస్తూ నల్ల బాడ్జీలు ధరించారు. నిరసనలో ఎంఐఎస్ స్వప్న, సీఆర్పీలు శివకుమార్, ప్రశాశ్‌రావు, శోభ, క్రాంతి, పీటీఐలు, ఐఈఆర్‌పీఎస్‌లు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపులో మళ్లీ విఫలం

జహీరాబాద్, నవంబర్ 29 : సంగారెడ్డి న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌ను శుక్రవారం మిషన్ భగీరథ జిల్లా, మండల అధికారులు సందర్శించారు. తొమ్మిది రోజులుగా స్థానిక ఫిల్టర్ బెడ్ నుంచి న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్ మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. స్థానిక మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ పరిధిలో పనిచేసే తాత్కాలిక కార్మికులతో సంబంధిత జిల్లా అధికారులు వేతనాల చెల్లింపు తదితర సమస్యలు వాటి గురించి చర్చలు జరిపారు. కార్మికులకు రెండు నెలలకు సంబంధించిన వేతనాలను చెల్లిస్తామని, మిగిలిన నాలుగు నెలల వేతానాన్ని 15 రోజుల్లో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా మిషన్ భగీరథ ఎస్సీ రఘువీర్, డీఈ నాగేందర్, మండల డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి అన్నారు. వెంటనే ఆందోళనను విరమించుకొని తాగునీటిని పునరుద్ధరించాలని కార్మికులకు సూచించారు. సంబంధిత అధికారులు, కార్మికుల మధ్య చర్యలు మళ్లీ విఫలం కావండత ఆందోళన యథావిధిగా కొనసాగించారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ కార్మికుల వేతనాల చెల్లింపు విషయాన్ని సంబంధిత జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తాగునీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుని ప్రజలు కోరుతున్నారు.

ఆకస్మిక తనిఖీ

విద్యార్థినీలతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో అశోక్ చక్రవర్తి

నిజాంపేట్, నవంబర్29 : సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల పరిదిలోని బాచెపల్లి గ్రామంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలను శుక్రవారం ఆర్డీవో అశోక చక్రవర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినీలతో పాఠశాల వివరాలను అడిగి తెలుసుకుని విద్యార్థినులతో కలిసి భోజనం చేసి సంతోషం వ్యక్తం చేశారు నిజాంపేట్ తహసీల్దార్ నాగజోతి, ఆర్ఐ జన్‌సన్, సీసీ వాజిద్, ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, నవంబర్ 29 : నారాయణఖేడ్ పట్టణ సమీపంలోని జూకల్ శివారులో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకులాన్ని శుక్రవారం ప్రత్యేకాధికారి సర్ధార్ సింగ్, ఎంఈవో వెంకటేశం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు ఆదేశించారు. భోజనం విషయంలో ఎటువంటి లోటుపాట్లు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయికోడ్ : తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసి దీక్షా దివస్‌కు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

అందోల్ : దీక్షా దివస్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో అందోల్-జోగిపేట నాయకులు

పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జహీరాబాద్ : దీక్షా దివస్‌కు తరలివెళ్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బీఆర్ఎస్ శ్రేణులు

దీక్షా దివస్‌కు తరలిన నేతలు

దీక్షాదివస్‌కు శుక్రవారం ఆయా మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో భారీ ఎత్తున కందికి తరలివెళ్లారు. వాహనాలకు గులాబీ జెండాలు రెపరెపలాడాయి. తెలంగాణ నినాదాలు మిన్నంటాయి.

-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 29

సదాశివపేట : దీక్షా దివస్ కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల : దీక్షా దివస్‌కు తరలిన ఉమ్మడి జిన్నారం మండల బీఆర్ఎస్ శ్రేణులు

నారాయణఖేడ్ : తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

బొల్లారం : దీక్షా దివస్‌కు తరలి వెళ్తున్న జిన్నారం మండల నాయకులు

ఆలయ వార్షికోత్సవాలను దిగ్విజయం చేయాలి

కోహీర్, నవంబర్ 29 : కవేలి మహాలింగ సంగమేశ్వరాలయ వార్షికోత్సవాలను దిగ్విజయం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాములు కోరారు. ఆలయ ఆవరణలో డిసెంబర్ 5 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఆలయ వార్షికోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం విడుదల చేశారు. మాజీ సర్పంచ్‌లు జగదీశ్వర్‌రెడ్డి, యాదవరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ చర్యలకు పీసీబీ ఆదేశాలు

బొల్లారం నవంబర్ 29: లీ ఫార్మా పరిశ్రమపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు పీసీబీ అధికారులు నియంత్రణ చర్యలకు ఉపక్రమించారు. జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమ నుంచి పైపుల ద్వారా వెలువడుతున్న రసాయన వ్యర్థ జలాలతో పాటు వాయు కాలుష్యంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు గతంలో ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. కాగా తనిఖీలు నిర్వహించిన అధికారులు తాజాగా కాలుష్యకారక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ పరిశ్రమకు నోటీసులు జారీ చేసింది. మరోసారి చర్యలకు పాల్పడితే నోటీసులు ఇవ్వకుండా మూసివేస్తామని హెచ్చరించారు.

గ్యాస్ పనులను నిలిపివేయాలి

కోహీర్, నవంబర్29: మండలంలోని మద్రి గ్రామంలో చేపట్టిన టొరంటో గ్యాస్ ఎజెన్సీ పనులను వెంటనే నిలిపివేయాలని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మద్రి గ్రామస్తుల విన్నపం మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి టోరంటో గ్యాస్ ఎజెన్సీ చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పొలాల మధ్య ఏర్పాటు చేయడం సరైందికాదన్నారు. మాజీ ఎంపీపీ శౌకత్ అలీ, తదితరులున్నారు.

నడుస్తున్న కంటైనర్‌లో మంటలు

పటాన్‌చెరు, నవంబర్ 29 : నడుస్తున్న కంటైనర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటన రుద్రారం జాతీయ రహదారి 65పై చోటు చేసుకుంది. ముంబై నుంచి విజయవాడకు వెళ్తున్న ఒక కంటైనర్‌లో రుద్రారం గ్రామ సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా అగ్గి రాజుకుంది. చూస్తుండగానే మంటలు డైవర్ క్యాబిన్‌కు, టైర్లకు అంటుకుంది. దీంతో డ్రైవర్ తక్షణం కిందికి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమదం చోటు చేసుకుందని డ్రైవర్ వివరించారు.

ఎల్లంకి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లకు డాక్టరేట్

డాక్టరేట్ పట్టాని అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

రామచంద్రాపురం, నవంబర్29 : ఎల్లంకి ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టరేట్ పట్టాలు సాధించారు. ఎల్లంకి కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు కుమారస్వామి, రవిచంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో బుచ్చిరెడ్డి కంప్యూటర్ సైన్స్‌కి సంబంధించి పీహెచ్‌డీని యూపీ జేఎస్ యూనివర్సిటీ నుంచి పూర్తి చేశారు. శుక్రవారం యూ పీ షికోవబాద్‌లోని జేఎస్ యూనివర్సిటీలో జరిగిన పీహెచ్‌డీ కాన్వోకేషన్‌కి ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు హాజరై యూపీ చీఫ్ ఇన్వర్మేషన్ కమిషనర్ రాజ్‌కుమార్, కంట్రోలర్ ఎగ్జామినేషన్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విక్రమ్‌సింగ్ యాదవ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కుమారస్వామి, రవిచంద్ర, బుచ్చిరెడ్డిలు 'నమస్తేతెలంగాణ'తో మాట్లాడుతూ జేఎస్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టాలు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

ఉద్యోగుల మానసికోల్లాసానికి వన భోజనాలు

సంగారెడ్డి జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ప్రభులత

జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో బహుమతులను అందజేస్తున్న మేనేజర్ ప్రభులత

జహీరాబాద్, నవంబర్ 29 : విధి నిర్వహణలో నిత్యం తలమునకలయ్యే ఆర్టీసీ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపేందుకు వన భోజనాలు ఏర్పాటు చేసినట్టు సంగారెడ్డి జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్తిక మాస వన భోజనాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం డిపో అవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి, మొక్కలను నాటారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, గ్యారేజ్ సూపర్ వైజర్ తిరుమలేశ్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, నవంబర్ 29: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం కార్తిక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య మాట్లాడుతూ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించామన్నారు.

క్షతగాత్రులను దవాఖానకు తరలించిన బీఆర్ఎస్ శ్రేణులు

నారాయణఖేడ్, నవంబర్ 29 : అందోల్ మండలం నాగ్సన్‌పల్లి 161 జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిని దవాఖానకు తరలించడంలో నారాయణఖేడ్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు సహకరించి, మానవత్వాన్ని చాటుకున్నారు. నేతలు చూపిన చొరువను పలువురు అభినందించారు.

2న పట్టుబడిన వాహనాలకు వేలం

జహీరాబాద్, నవంబర్ 29 : ఎక్సైజ్ అధికారుల దాడుల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిసెంబర్ 2న స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మధ్యాహ్నం 12 :15 గంటలకు వాహనాలకు వేలం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

ఉద్యోగ విరమణ వీడ్కోలు

జహీరాబాద్, నవంబర్ 29 : ఉద్యోగ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం ఆనందంగా గడపాలని జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిచరణ్ అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో పనిచేసే సెక్రటరీ అనిల్‌బాబు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అందోల్, నవంబర్ 29 : ఆటో-లారీ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని దానంపల్లికి చెందిన పలువురు జోగిపేట నుంచి దానంపల్లి వెళ్తుండగా సంగారెడ్డి వైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలు కావడంతో స్థానికులు జోగిపేట ప్రభుత్వ దవఖానకు తరలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లీయర్ చేశారు.

గురుకులాన్ని సందర్శించిన శిక్షణాధికారులు

అందోల్, నవంబర్ 29: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని గురుకుల పాఠశాలను సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి అందుతున్న వసతులు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. కమిషనర్ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే

మునిపల్లి, నవంబర్ 29 : మండలంలోని అంతారంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న జీవన్ముక్త పాండురంగ ఉత్సావాల్లో శుక్రవారం అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు జైపాల్‌రెడ్డి, సాయికుమార్, మునిపల్లి మాజీ జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి మంతురి శశికుమార్, అంతారం మాజీ సర్పంచ్‌లు ఎడ్ల శంకర్, సిద్దన్నపాటిల్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.